# ఎస్వీ యూనివర్సిటీలో ర్యాగింగ్ వ్యవహారం

**తిరుపతి,నవంబర్6 :**

- **సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డిపై సస్పెన్షన్ వేటు**

తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ర్యాగింగ్ వ్యవహారం సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డిపై సస్పెన్షన్ వేటుకు దారితీసింది. విద్యార్థినుల ఫిర్యాదుపై యాంటీ ర్యాగింగ్ కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా విశ్వనాథరెడ్డిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి తుది ఆదేశాలు అందిన తర్వాత తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామని పేర్కొన్నారు. విశ్వనాథరెడ్డి తమను ఇంట్రాక్షన్ సెషన్ పేరుతో ర్యాగింగ్ చేయించారని.. సైకాలజీ మొదటి సంవత్సరం విద్యార్థినులు ఈనెల 3న లిఖిత పూర్వకంగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధిత విద్యార్థినులు వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలతో కలిసి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తమకు రక్షణ కల్పించాలని, తక్షణమే సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలో చదవలేమని, కొన్ని సంఘ విద్రోహ శక్తులు ప్రేరేపించే రీతిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు టీసీలు ఇస్తే వెళ్లిపోతామని పేర్కొన్నారు. వర్సిటీ ఆవరణలో, వసతి గృహాల్లో కొందరు కావాలనే తమను ఏడిపిస్తున్నారని, ర్యాగింగ్ అంశంలో వెనక్కి తగ్గాలంటూ బెదిరిస్తున్నారని వాపోయారు.

## శంకరపట్నంలో పంపుసెట్ల సర్వీస్ వైర్ల చోరీ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండలంలోని ఆముదాలపల్లిలో రైతులను దొంగలు బెం బేలెత్తిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి గు ర్తుతెలియని వ్యక్తులు 8 మంది రైతుల పంపుసెట్ల సర్వీస్ వైర్లను దొంగిలించారు. కన్నబోయిన రవీంద్ర ప్రసాద్, లక్ష్మణ్, అజయ్, జంపయ్య, సమ్మయ్య, సమ్మిరెడ్డి తదితర రైతుల సర్వీస్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఘటనతో రైతులు తీవ్ర ఆం దోళ న వ్యక్తం చేస్తూ, ఇలాంటివి పునరా వృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మాజీ క్రికెటర్ల ఆస్తులపై ఈడీ సోదాలు

- **ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కేసులో11.12 కోట్ల ఆస్తులు అటాచ్**

**న్యూఢిల్లీ, నవంబర్ 6:**

టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ ఆస్తులపై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేపట్టింది. వీరిద్దరూ అక్రమంగా 1లీబెట్ అనే ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ ను ఆమోదించారనే ఆరోపణల నేపథ్యంలో.. సంబంధిత మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా జరిపిన సోదాల్లో రూ.11.14కోట్ల విలువైన ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తుచేసింది. ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కు సంబంధించి రూ.4.5 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉండగా, మాజీ స్టార్ బ్యాట్స్‌మెన్ సురేశ్ రైనాకు చెందిన రూ.6.64 కోట్ల విలువైన మ్యూచ్‌వల్ ఫండ్స్ పెట్టుబడులు ఉన్నట్టు సమాచారం. వీరిరువురూ 1లీబెట్, దాని అనుబంధ బ్రాండ్‌లతో ప్రత్యక్షంగా/పరోక్షంగా సంబంధమున్న విదేశీ సంస్థలతో ఉద్దేశపూర్వకంగా ఎండార్స్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకున్నట్టు సంబంధిత అధికారులు ఆరోపించారు. ఈ ప్రమోషనల్ ఒప్పందాలే భారతీయ వినియోగదారులలో అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ విస్తరణకు సాయపడి ఉండొచ్చని, ఫలితంగానే ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టినట్టు తెలుస్తోంది. అయితే.. ఈ ఘటనపై ఇప్పటివరకూ రైనా, ధావన్‌లెవరూ స్పందించలేదు.రైనా, ధావన్‌లతో పాటు మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, నటులు సోనూసూద్, ఊర్వశి రౌతేలా, తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి , బెంగాలీ నటుడు అంకుష్ హజ్రా వంటి పలువురు ప్రముఖులనూ ఈడీ ప్రశ్నించింది. బెట్టింగ్ ఫ్లాట్ ఫామ్, దాని అను బంధ సంస్థలతో వీరికి సంబంధమున్నట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో వీరిని విచారించినట్టు తెలుస్తోంది. ఇక్కడి చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ దర్యాప్తులు చేపట్టింది. భారతదేశంలో బెట్టింగ్ వంటి వాటిపై నిషేధం ఉన్నప్పటికీ ఈ ప్లాట్‌ఫామ్ మాత్రం ఆన్‌లైన్ ప్రమోషన్లు, ప్రముఖుల ఆమోదంతో యువతను ఆకర్షిస్తోందని సమాచారం.



## సత్య హరిశ్చంద్ర కళాకారులకు సన్మానం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

కార్తీక పౌర్ణమి సందర్భంగా గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర నాటకంలోని 22మంది కళాకారులను తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య మంచిర్యాల జిల్లా కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యానాపు ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు డా. జానపాటి శరత్ బాబు, సలహాదారుడు గుండేటి యోగేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండు జనార్ధన్, ఉపాధ్యక్షుడు పొనగంటి దక్షిణామూర్తి పాల్గొన్నారు. నాటకం సమాజానికి స్ఫూర్తినిచ్చే సందేశమని, ప్రజల్లో చైతన్యం రేపుతుందని వారు పేర్కొన్నారు



## బోథ్‌లో గుంతల పూడ్చిన నేచర్ కమిటీ

**శెనార్తి మీడియా, బోథ్:**

సమాజం పైన కనీస బాధ్యతగా బోథ్–నిర్మల్ రహదారిపై ఏర్పడిన ప్రమాదకర గుంతలను నేచర్ కమిటీ సభ్యులు స్వయంగా పూడ్చారు. ప్రజల రక్షణలో భాగంగా సామాజిక సేవకు ముందుకువచ్చామని కమిటీ సభ్యులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు షేక్ అలీ, సభ్యులు దాసరి పురుషోత్తం, గొడిసెల రమణ గౌడ్, వైద్య సురేష్, అల్లకొండ పోతన్న, అబ్దుల్ రవుఫ్, కోల ప్రశాంత్ పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి టైపింగ్ హయ్యర్ ఎగ్జామ్ లో

## శ్రీ భాష్యం సహస్ర కు 3 వ ర్యాంక్

**శెనార్తి మీడియా, హైదరాబాద్ :**



ఇంటర్మీడియట్ 2 వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీ భాష్యం సహస్ర, తెలంగాణ టెక్నికల్ బోర్డు ప్రతి సంవత్సరం నిర్వహించే ఇంగ్లిష్ టైపు రైటింగ్ హయ్యర్ పరీక్ష లో అత్యుత్తమ నైపుణ్యం తో రాష్ట్ర స్థాయి లో 3 వ ర్యాంక్ సాధించింది. ఉప్పుగూడ లో ని గౌతమ్ టైపు రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ లో తర్ఫీదు పొంది , జులై 2025 లో బోర్డు నిర్వహించిన ఈ పరీక్ష లో తమ విద్యార్థిని ఈ ప్రతిభ కనబరచడం పట్ల ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ అరుణ్ హర్షం వ్యక్తం చేసి , విద్యార్థిని కి శుభాకాంక్షలు తెలిపారు . ఈ ర్యాంక్ సాధించడం తమ ఇన్ స్టిట్యూట్ కే గర్వకారణం అన్నారు. భవిష్యత్తు లో ఆమె మరింత పై స్థాయి కి ఎదగాలని కోరుతూ అభినందించారు.

### మంథని లో సైబర్ మోసాలపై అవగాహన

**మంథని, నవంబర్ 6 :** "సైబర్ జాగృతి దివస్ సందర్భంగా గురువారం మంథని సోషల్ వెల్ఫేర్ స్కూల్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంథని ఎస్సై డి. రమేష్ మాట్లాడుతు ప్రస్తుత సాంకేతిక రోజులలో అందరు సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని, ఏపీకే ఫైల్ ఓపెన్ చేయవద్దని, అపరిచిత ఫోన్ నెంబర్ల నుండి వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, అపరిచిత వ్యక్తులు చేసే వీడియో కాల్స్ కి స్పందించవద్దని, ఎవరికి ఓటిపి లు చెప్పవద్దని, ఆన్లైన్ ఉద్యోగాల మోసాలపై అవగాహన కలిగి ఉండాలని, అధిక డబ్బులు వస్తాయని ఆశపడి మోసపోవద్దని, ఎలాంటి డిజిటల్ అరెస్టులు లేవని ఎవరు అలాంటి వాటిని నమ్మవద్దని, ఏదైనా సైబర్ మోసం జరిగినట్టు గ్రహిస్తే వెంటనే 1930 కు ఫోన్ చేయాలని ఆయన అన్నారు.

# దేశాభివృద్ధికి యువతే పునాది

- **సబ్ కలెక్టర్ మనోజ్**
- **మంచిర్యాలలో వైభవంగా యువజన ఉత్సవాలు, శాస్త్ర మేళా**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



దేశాభివృద్ధికి యువతే ప్రధాన బలమని, వివేకానందుని స్ఫూర్తితో సమాజ సేవలో ముందుండాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పిలుపునిచ్చారు. మంచిర్యాల పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ లో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు, శాస్త్ర మేళా–2025లో ఆయన పాల్గొన్నారు. యువత తన ప్రతిభ, సృజనాత్మకతతో దేశానికి దిశా నిర్దేశం చేయగలదని ఆయన అన్నారు. కార్యక్రమానికి జిల్లా యువజన, క్రీడాధికారి హనుమంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర సాంస్కృతిక సలహా మండలి సభ్యుడు అంతడుపుల నాగరాజు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. జానపద నృత్యం, బృందగానం, ఉపన్యాసం, కవితా రచన, కథారచన, చిత్రలేఖనం, శాస్త్ర ప్రదర్శన విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లావ్యాప్తంగా వందమంది విద్యార్థులు తమ ప్రతిభను చూపించారు. పోటీలలో నృ త్యంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ గర్ల్స్ మంచిర్యాల, బృందగానంలో ప్రభుత్వ బాలుర హాస్టల్ మంచిర్యాల, ఉపన్యాసంలో జి. విష్ణువర్ధన్, కవితా రచనలో ఎం.డి. షబాన్, కథారచనలో ఆర్. గోపి, చిత్రలేఖనంలో బి. మణికుమార్, శాస్త్ర విభాగంలో వి. విశ్వసూర్య విజేతలుగా నిలిచారు. రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాల్లో జిల్లా తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ కిషన్, ఎస్సీ కార్పొరేషన్ డీడీ చేతరాజుల దుర్గాప్రసాద్, వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, జాతీయ పురస్కార గ్రహీత టీ. సత్యం, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.







## వైద్య శిబిరాల పరిశీలన

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత మంచిర్యాల జిల్లాలో జరుగుతున్న జోనల్ గురుకులాల స్పోర్ట్స్ మీట్, యూత్ ఫెస్ట్–2025 కార్యక్రమాల్లో వైద్య శిబిరాలను సందర్శించారు. మూడు రోజులపాటు జరిగే శిబిరాల్లో సిబ్బంది సేవలను సమీక్షించిన ఆమె, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఓపి విభాగం నిర్వహణను పరిశీలించి, రోగులకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నస్పూర్, రాజీవ్‌నగర్, వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆర్‌బీఎస్‌కే, ఆ యుష్మాన్ బృందాలు సేవలందించాయి.

# రైతు పంట అమ్మే పరిస్థితి లేదు

**బోథ్ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి**

**శెనార్తి మీడియా, బోథ్:**

కేంద్ర ప్రభుత్వ మార్కెట్ విధానాల వలన రైతు తీవ్రంగా నష్టపోతున్నాడని బోథ్ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తెలిపారు. పత్తి, మొక్కజొన్న ధరలు పడిపోవడం, యూరియా కొరతతో పంటలు దెబ్బతినడం రైతు స్థితిని మరింత దుర్భరంగా మార్చిందన్నారు. పార్లమెంట్ లో రైతు సమస్యలపై బీజేపీ ఎంపీలు నోరు మూసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. చిన్న రైతులు స్మార్ట్ ఫోన్, నెట్ వర్క్ సదుపాయం లేక మార్కెట్ లో పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ ల ఆధీనంలోకి నెట్టే కేంద్ర విధానాలు వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. క్రాఫ్ కిషన్ యాప్ ను రద్దు చేసి, ప్రతి ఎకరాకు కనీసం 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు హామీ ఇవ్వాలని, తేమ శాతం 20% వరకు అంగీకరించాలని గంగారెడ్డి కోరారు.

## పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలి



- **ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల విజ్ఞప్తి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జాతీయ ఆరోగ్య మిషన్‌లో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు, ఏడు నెలల పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శాంతి కుమారికి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి బాపు యాదవ్, నాయకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీకి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు 'సమాన పనికి సమాన వేతనం' విధానం అమలు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని యూనియన్ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీర్తి, రజిత తదితరులు పాల్గొన్నారు.

### ఫీజు బకాయిలు చెల్లించాలి



**శెనార్తి మీడియా, బోథ్:** విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటుందని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మనాల శేఖర్ అన్నారు. వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ప్రైవేట్ కళాశాలలు మూతపడి పేద విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బంది లు పడుతున్నారని పేర్కొన్నారు. పరీక్షల సమయం దగ్గరపడుతున్నందున వెంటనే స్కాలర్‌షిప్‌లు, బకాయి నిధులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని డిమాండ్ చేశారు